IJMRT: Volume (1), Issue 2, April 2019

ISSN (Print) : 2663-2381
ISSN(Online) : 2663-4007

International Journal of Multidisciplinary Research Transactions

(A Peer Reviewed Journal)

www.ijmrt.in

# శ్రీ కృష్ణదేవరాయల - సంస్కృతీ సంప్రదాయలు

## డా. మొరంగపల్లి పద్మకుమారి*

*అసోసియేట్ ప్రొఫెసర్ ఆఫ్ తెలుగు, బేగంపేట ప్రభుత్వ మహిళా డిగ్రీకళాశాల, బేగంపేట, హైదరాబాద్.*

*Corresponding author

---

**“శ్రీ కమనీయ హారమణి, జెన్నుగc దానునుc కౌస్తుభంబునం**
**నా కమలా వధూటియు నుదారతc దోపc బరస్పరాత్మలం**
**నా కలితంబులైన తమయాకృతులచ్ఛతc బైకి దోcపన**
**స్తోకత నందు దోcచెనన శోభిలు వేంకట భర్త గొల్చెదన్”**

అని శ్రీః వేంకటనాథులు పరస్పరానురాగాతిశయముచే నొకరి హృదయ ఫలకము నందొకరు ప్రతిఫలించునట్లు గోదా రంగనాథుల మనమ్ములందలి ప్రణయ భావక్తములచే ఒకరి హృదయమునందొకరు వసించియున్నారని ఉత్పలమాల వృత్తమునందు చెప్పుటవలన పరిణయాంతమై పరిఢవిల్లిన కావ్యమని ఆలంకారిక సంప్రదాయాను సారముగా చమత్కరించిన రాయలకవి రాజకవి.

“ఆముక్త మాల్యద” అనగా ముందు తాను ధరించిన మాలను సమర్పించునది అను అర్థముతో క్రియ స్ఫురించునట్లుగా శీర్షికా నిర్ణయము చేసి నూత్న ఒరవడికి శ్రీకారము చుట్టినాడు శ్రీకృష్ణదేవరాయలు.

“రక్షితారస్తు నేతారః” రక్షకులు నేతలు. వారిని రక్షించేవాడు శ్రీ మహావిష్ణువు. అతడే మహాచక్రవర్తి. అతని ఆ జ్ఞానుసారము ఆముక్త మాల్యద ఆయనకే సమర్పింపబడినది.

శ్రీకృష్ణదేవరాయలు తుళువ నరస నాయకుడు, నాగలాంబల కుమారుడు. క్రీ.శ. 1509 ఫిబ్రవరి 4వ తేదిన పట్టాభిషిక్తుడయిన శ్రీ కృష్ణదేవరాయలు అటు సామ్రాజ్య విస్తరణ, ఇటు సాహిత్యాదరణ రెండింటిని సమాన పరాక్రమ ప్రజ్ఞా పాటవాలతో నెరపిన సమర్థుడు.

“నమతి ప్రాప్నోతోతి వృత్తం ఫలంవా నాయకమ్” అన్నారు. కథేతి వృతాన్ని స్వీయానుకూలముగా మార్చుకుంటూ తత్ఫలభోక్తయైనవాడే నాయకుడు. ఆముక్తమాల్యదలోని కథలన్నింటిని ప్రాసంగికముగా నడిపి, ధర్మస్థాపనార్థ మార్గమునకు మళ్ళించి విష్ణు పాదాంకితము

చేయుటయే విష్ణుచిత్తీయము. పలికెడిది భాగవతమట, పలికించెడు వాడు రామభద్రుండట" అన్నట్లు కథ ఏదైనా కైంకర్య మొక్కటే పరమార్థము.

అందుగల "ఐదు కథలు ఐదు పద్ధతులలో చెప్పబడ్డాయి. విష్ణుచిత్తుని కథలో మాధుర్యము, కేశిధ్వజ ఖాండిక్యుల కథలో తిక్కన భారత రచనా పద్ధతి, మాలదాసరి కథలో శ్రీకృష్ణదేవరాయలు వున్నాడ"ని వేయి పడగలులో పి.వి. నరసింహారావుగారన్నారు.

యమునార్యుని కథలో శ్రీ వైష్ణవ మతస్థాపన, మాలదాసరి, బ్రహ్మరాక్షసుల భగవత్సాయుజ్యము, శ్రీ మహావిష్ణువు పట్ల భక్తిని పెంపొందించు చున్నవి. గోదావిర్భావము, ఆమె శ్రీరంగేశుని వలచి, వలపించుకొనుట, వివాహమాడి నాయకుని చేరుట మొదలగునవి మధుర భక్తికి పరాకాష్ఠ.

శ్రీ కృష్ణదేవరాయలు శ్రీ వైష్ణవ ప్రోక్తమైన శ్రీ మన్నారాయణ తత్త్వమును రసముఖముగా వ్యాఖ్యానించినాడు. సగుణ నిర్గుణాకారములలో సగుణ స్వరూపమే మోక్షసాధనమని ముండకోపనిషదాదులు ఉద్ఘాటించుచున్నవి. ఉపనిషద్ప్రోక్తమైన భువనైకసుందరుని సల్లక్షణములను స్తుతించి, మెప్పించి, కృపాకటాక్షములను పొందుటయే భాగవతుని కర్తవ్యము.

అసంఖ్యాకమైన భగవద్గుణ స్వరూపములలో జ్ఞాన, బల, ఐశ్వర్య, వీర్య, శక్తి, తేజస్సౌశీల్య, వాత్సల్య, మార్దవార్జవ, సౌహార్ద, సౌమ్య, కారుణ్య, మాధుర్య, గాంభీర్యౌదార్య, చాతుర్య, స్థైర్య, ధైర్య, శౌర్య, పరాక్రము, సత్యకామ, సత్యసంకల్ప, కృతిత్వ, కృతజ్ఞతాదులు అనంత కల్యాణ గుణములకు నిధానమైన భగవత్స్వరూపమును తెల్పుచున్నవి. సృష్టి, స్థితి, లయాదులన్నియు దయాహేతువైన భగవంతుని కారణముననే జరుగుచున్నదని శ్రీ వైష్ణవ సిద్ధాంతము.

అంతర్హితముగా భక్తి మార్గమున నడిచిన అముక్త మాల్యద కావ్యములో అంగిరసము శృంగారమే అయినా సందర్భాన్ని బట్టి నవరసాలు రక్తికట్టినవి. రాయల పరిపాలనా దక్షత, బహుళ సాహిత్య పోషణ, స్వీయరచనా పాటవములు అనితర సాధ్యములు.

శ్రీకృష్ణదేవరాయలు పరిపాలనములో రాజ్యము సర్వతోముఖాభివృద్ధి చెందినది. శ్రీ విలిబుత్తూరులోని పౌరజీవమును పరిశీలించినట్లైతే ఆనాటి ప్రజల సంస్కృతీ సంప్రదాయములు మనల నాశ్చర్య చకితుల జేయును. ఆనాటి గృహ నిర్మాణములు, ఆహార, ఆహార్యాదులు, విహారాదులు, విలాస జీవనమునకు, విలసిత సంస్కృతికి దర్పణముగా తోచును.

శ్రీ విలిబుత్తూరులోని గృహములు రత్నమయములైన ఆకాశమునంటుచున్నవనుటలో బహుళ అంతస్థుల మేడలుండుట ఆనాటి సంపన్న సంస్కృతికి నిదర్శనము. స్త్రీలు విద్యావంతులయి వివేకముతో మెలగువారు. ఆచారవ్యవహారములు తెలిసిన వారైయున్నారు. స్త్రీలు పసుపు రాసుకొని స్నానము

చేయుట మన సంప్రదాయము. దీనిని "శయ పూజాంబుజముల్ ఘటించడబడన్" అను పద్యములోను, తదితర పద్యములందును మన సంస్కృతిని సవివరముగా వర్ణించిన రాయలు సంప్రదాయవాది. పసుపు వినియోగము శ్రీ సౌందర్య పోషణకే గాక ఆరోగ్యసౌభాగ్యములను చేకూర్చునను మన సంస్కృతిని తెల్పినాడు.

కాలాను గుణము గా గ్రీష్మ, వసంత ఋతువులు కనుగుణముగా గ్రహనిర్మాణము జరిగెడిది. ప్రతి ఇంటికి రెండు ప్రక్కలా అరుగులు, కంబములు వుండి, వాటిమీద లతలు, పుష్పములు చిత్రింపబడి వుండెడివి. గోడలమీద చిత్తరులు చిత్రవిచిత్రమైన బొమ్మలు తీర్చబడి వున్నవనుటలో, శిల్పకళ, చిత్రలేఖనము మొదలైన కళలు ఎంతో ఆదరింపబడినవని తెలియుచున్నది. ప్రతి ఇంటిలోను ఒక పూలతోట, ఆ తోటలో కొలను, తప్పనిసరియై యుండెడిది. ఈ సంస్కృతి సంపన్నుల ఇంట నేటికీ కొనసాగుతున్నది.

శ్రీ విలిబుత్తూరులోని యువతులు సుమకోమలురు. పసిడి నగలు చిలుము పట్టునని వానిని త్రోసివేసి ముత్యాల సొమ్ములు భరింతురు. పునుగు జిడ్డుగలదని దానిని పూసుకొనుట వదలి కస్తూరియే పూసుకొందురు. తలలో విరులు తురిమిన చెమ్మగిల్లునని వానిని విడిచి ధూమ ధూపముల చేతనే వెండ్రుకలకు వాసవలెక్కింతురు. సరిగ మొదలైన వలువలు కఱుకు వగుటచే నొఱయునని వానిని పరిహరించి జిలుగు వలువలే కట్టుదురు. ఆనాటి స్త్రీల అలంకరణ వారివలెనే యెంత కోమలమో తెలియుచున్నది. ఈ అలంకరణ వారి వారి స్థాయిని బట్టి వున్నట్లు వర్ణింపబడియున్నది. ఇది ఆనాటి స్త్రీ ఆహార్యాదుల సంస్కృతిని తెల్పుచున్నది.

ఆపురిలో యువతులు వడ్లనెండబోసికొని యున్నపుడు స్వామి కోవెలలోని పెంపుడు జింకపిల్ల వచ్చి, వడ్లను బొక్కుచుండగా, దానిని కలువ తో దండలతో తోలుదురని చెప్పుట ఆనాటి సుకుమారమైన మనస్తత్వానికి, అహింసకు నిదర్శనమగు సంస్కృతిని తెల్పుచున్నది.

శ్రీ విలిబుత్తూరులో వరి, చెఱకు, మామిడి, పనస, వాడిమి, ద్రాక్ష, తమలపాకుల తోటలు విరివిగా వుండెడివనుట వలన రుచికరమైన ఆహారమును భుజించుచురని తెలియుచున్నది. వారు ఆరగించుటయే గాక చేరవచ్చిన అతిథి అభ్యాగతులకును అట్లే సకల మర్యాదలు చేయుచుండిరనుటకు విష్ణుచిత్తుని కథ తార్కాణము.

విష్ణుచిత్తుడు తైత్తరీయోపనిషత్తు వాక్యమైన "ఆచార్య దేవోభవః" అను సూక్తిని తు.చ. తప్పకుండా అనుసరించువాడు. అతడు తన న్యాయార్జితమైన ధనముతో హిమాచల, మలయాచల మధ్య మార్గస్థులై యున్న వైష్ణవ సముదాయమునకు అహర్నిషలు అతిథిసత్కారములు నెరపుతాడు. ఏయే ఋతువులందు

ఏయే ఆహారమము శక్తినిచ్చునో అట్టి పదార్థములు వడ్డించువాడు.

విష్ణుచిత్తుని యింటిలో నున్న అతిథులకు శనివారమునాడు వైష్ణవాచార యుక్తముగా సత్కారములు జరిగెడివి. పరదేశి వైష్ణవులు స్నానమునకు సమాయత్తమగు తీరును కన్నులకు కట్టించాడు రాయలు. యిప్పపిండిని నూతి ఆ ముద్ద చేతిలో పెట్టుకొని, దాని మీద అరటిపూవు దొన్నె నుంచి, దానిలో విష్ణుచిత్తుని యింటిలో గల బానలలోని నూనెను పోసికొని, స్నానానంతరము ధరించుటకు ధోతి వస్త్రములు త్రాడుకట్టి, తాకక యొక చేత బట్టుకొని నదికిబోయి అభ్యంగన స్నానము చేసి వత్తురట. అతిథులకు భోజనాదులే గాక సకల సదుపాయములను కల్పించి, వారు వీరి యింట వున్నన్ని రోజులు వైష్ణవాచారములకు, నిత్యనైమిత్తికములకు అనుకూలమైన సౌకర్యములను కల్పించుచూ దైవస్వరూపముగా కొలిచెడివాడు విష్ణుచిత్తుడు.

విష్ణుచిత్తుని యింటిలో ఆవిర్భవించిన గోదాదేవి యౌవనవతి యయినది. ఆ సమయమున కృష్ణుని పొందుటకు గోపికలు కాత్యాయనీ వ్రతమును ఆచరించినట్లు తెలుసుకున్నది. తానును శ్రీ రంగేశుని పతిగా పొందుటకు ధనుర్మాస వ్రతమును ఆచరించినది. ధనుర్మాసారంభమునుండి వేరువ జామున లేచి. చన్నీటి స్థానము చేసి ముప్పై రోజులు రోజుకొక్క కృష్ణగాథను శ్లోకముగా రచించి పాడి వటపత్ర శాయని పూజించినది. దీనిని ధనుర్మాసము మొదటి దినము నుండి అనగా సంక్రాంతి రోజులలో పాటించుట సంప్రదాయముగా మారినది. ఇదే "తిరుప్పావై" అయినది. వ్రతములు మొదలైనవి మన సంస్కృతిలో భాగముగా 'మారినవనుటకు ఇది తార్కాణమయి వున్నది.

వివాహానికి పూర్వము వరుని కొరకు కన్య యింటికి వచ్చి "పిల్లనిమ్మ"ని అడుగుట మన సనాతన సంప్రదాయము. ఈ సంప్రదాయమును బ్రహ్మరుద్రాదులు వచ్చి శ్రీ రంగేశుని కొరకు గోదాదేవి నిమ్మని అడిగిన ఘట్టము రాయల సంస్కృతి–సంప్రదాయములకు ప్రతిబింబమనిపించును.

శ్రీ మహావిష్ణువు తపోమూర్తి బ్రహ్మ లక్షణము. ధర్మరక్షణ స్థాపన క్షత్రియ లక్షణము. ఈ రెండు లక్షణములు గలవాడే. "నా విష్ణుః పృధివీపతిః" అన్నారు. యామునార్యుడు సకల విద్యావేత్త అయిన ధనురాదికి, క్షత్రియ కాంతకు జన్మించిన వాడు. అతని తండ్రి రాజధర్మమును బోధించినాడు. ఇది అనాది భారతీయ సంస్కృతి. వాదములో తన గురువు నవమానించి, వానికి గుణపాఠము నేర్పుటకు శైవ మతావలంబియైన పాండ్యరాజు నొద్దరు వెళ్ళెను. వైష్ణవ మతాభిమాని యయిన పాండ్యరాణి సహాయమున పాండీకి శ్రీ వైష్ణవ మత బోధచేసి శ్రీ వైష్ణవమును స్థాపించినాడు.

యమునార్యుడు రాజ్య పట్టాభిషిక్తుడయిన తర్వాత అతని పాలనను గురించి భగవంతుడు "జన్నములు చేసి దానములన్నానా దేశ విప్రులందనిపెను" తాను నారాయణుడు యజ్ఞమూర్తి.

బ్రాహ్మణుడు "బ్రాహ్మణో బ్రాహ్మణ ప్రియః" యజ్ఞములు చేయుట, దానాదికములు చేసి బ్రాహ్మణ తృప్తి చేయుట రాజర్షులు సంప్రదాయము.

మాలదాసరి చండాల కులమున జన్మించినను అచంచలమైన భగవత్సేవచే మీ ముక్తి గాంచినాడు. ఇతనితో పాటు బ్రహ్మరాక్షసుడు కూడ నిర్హేతుక కృపను పొందినాడు. ఇది భగవంతుని దయాలక్షణము అతని ఘటనాఘటన సామర్థ్యము.

మధురా నగర వర్ణనములో చతుర్వర్ణముల వారు వారి వారి వర్ణ సంస్కృతినెట్లు నిర్వర్తించినారో వర్ణించి చెప్పినాడు రాయలు. బ్రాహ్మణులు నిత్య వ్రేతలై వెలుగుచుండిరి. వారి దక్షిణ హస్తమునం దెల్లప్పుడు నిగమ సిద్ధముగా అగ్నిని కలిగి యుండెడివారు. దేవేంద్రాదులిచ్చు దానోదకములు కూడా గ్రహింపక వేదాధ్యయనము, జపయజ్ఞపరులై ఒప్పుచుండిరి.

క్షత్రియులైన రాజకుమారులు నిత్య ఉపాసనాకాలము నందే కవచాదులు పఠించి యున్నందున యుద్ధకాలము నందు కవచము తొడగకనే యుద్ధము చేయుదురు.

వైశ్యులు ధర్మబద్ధ వ్యాపారములు చేయుచు కోటికి పడగెత్త నానాటికి హెచ్చుగుచున్న ద్రవ్యముచే తులతూగుచుండిరి. కాపులు నాగలి పట్టి దున్నుట వలననే కోట్లకొలది ధాన్యరాసులు కొండలుగ పండించుకొని సత్పురుషుల సేవ చేయును సుఖంబుగ నుండుదురు. ఇట్లు వృత్తి ధర్మమును నిర్వర్తించుచునే భగవత్సేవను చేయుచుండుట అప్పటి సంప్రదాయము.

కావ్యారంభములో ప్రస్తావన తర్వాత చాలచోట్ల శ్రీవేంకటేశుని పలుపలు విధాల ప్రస్తుతించి తిరుమల పుణ్యక్షేత్రమును సాక్షాత్కరింపజేసినాడు. ఆరుమలలో వెలసిన కలియుగ ప్రత్యక్ష దైవము కరుణాకటాక్ష వీక్షణ కృపాళువు ఆర్యత్రాణ పరాయణుడు ఆశ్రిత రక్షకుడునైన శ్రీ వేంకటేశుడంటే రాయలకు అత్యంత భక్తి. తిరుమల శ్రీ వేంకటేశుని ఏడు సార్లు దర్శించి, వజ్రాభరణాలు భూములు భగవంతుని కర్పించినాడు. తిరుమల బ్రహ్మోత్సవాలు జరిపేటప్పుడు, ఇతర పూజా సందర్భాలలోను ధ్వజారోహణముతో శుభారంభము చేసి, విష్వక్సేనుని పూజించుట ఆచారముగా నున్నది. ఈ ఆచారము నేటికినీ ఒక సంప్రదాయముగా నడుస్తున్నది. ఈ ఆచారాన్ని రాయలు ఆముక్త మాల్యదలో సైన్యపతి కాంచన వ్రేతము కదలనిదే తోడ వ్యవహారము జరుగదని చెప్పినాడు. శ్రీవారి పాంచజన్యము పూరించగా ఆ ధ్వని మాత్రము చేతనే రాక్షసులు ప్రాణములు విడిచిరట. శంఖ, చక్ర గదాధరుడైన శ్రీ వేంకటేశ్వరుని చక్రమునకు ఖడ్గమునకు ప్రాధాన్యమిచ్చినాడు. శ్రీహరి నందక ఖడ్గము "నందంబగు నందకంబు ఘలతా శ్రేణిచ్ఛిదం జేయుతన్" అన్నాడు.

"యశసే అర్థకృతే" అన్నట్లు శ్రీకృష్ణదేవరాయలు రాజవంశమున జన్మించి ఐశ్వర్యమున

తులతూగుచుండెను . ఆముక్త మాల్యదను రచించి తద్వారా ఆ వైష్ణవ మతమును స్థాపించి, దానిని వ్యాపింపజేసి ఎనలేని యశస్సును పొందినాడు. తన కుమారునికి తిరుమల దేవరాయలని, కుమార్తెకు తిరుమలాంబయని పేర్లు పెట్టుకొనుట శ్రీ వేంకదేశుని మీద గల భక్తికి నిదర్శనము.

వర్ణాశ్రమ ధర్మములను వైదిక ధర్మ బద్ధం చేసిన రాజనీతిజ్ఞుడు శ్రీకృష్ణరాయలు. మను మార్గాన్ననుసరించి మహాచక్రవర్తి అయినాడు. "రాజ్యాంతే నరకం ధృవమ్మ"ను మాటను మార్గము దప్పించినాడు.

"ధరణి వర్ణాశ్రమముల కాధారమైన యట్టి విద్యల రక్షించు నట్టి మధిపుడఖిల వర్ణాశ్రమముల వారానరించు పుణ్య మాఅత పాలు నా నా బొరయునంద్రు" అని శ్రీకృష్ణదేవరాయలకు ఈ పద్య తాత్పర్యము చక్కగా నొప్పుచున్నది.

శ్రీ కృష్ణ దేవరాయల పరిపాలనము నందు ప్రజలు ధర్మబద్ధులై సంస్కృతీసంప్రదాయములను పాటించుచూ సౌశీల్య జీవనము గడుపుతున్నారు గనుక వారు పుణ్యపు పనులను మాత్రమే ఆచరించుదురు. వారి పూణ్యములోని ఆఅవ వంతు పుణ్యము. పరిపాలకుడగు శ్రీ కృష్ణదేవ రాయలకే దక్కుతుంది.

## ఆధార గ్రంథాలు:


1. ఆముక్త మాల్యద ఆంధ్రవ్యాఖ్యాన సహితము
   - వావిళ్ళ రామస్వామి శాస్త్రులు అండ్ సన్స్ -
   ఆది సరస్వతీ నిలయ ముద్రాక్షరశాల తడిమార్పేట
   - చెన్నపట్నం (3వ కూర్పు) 1907.పుట.4
2. తెలుగు సాహిత్య సమీక్ష రెండవ సంపుటం
   - జి. నాగయ్య
   (నవ్య పరిశోధక ప్రచురణలు, 18-1-699, భవాని నగర్, తిరుపతి, 1985, 1996)
3. ఆముక్త మాల్యద - సౌందర్యలహరి వ్యాఖ్యానం - ప్రథమభాగం
   "అభినవ భారతి" ఆచార్య కోటేశ్వర రావు